# ఆదర్శ సేంద్రియ రైతు సుబ్బయ్య

## సేంద్రీయ వ్యవసాయమే జీవన విధానంగా మలుచుకున్న అయ్యవారిపల్లి సుబ్బయ్య

రాప్తాడు మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందిన (40 సం॥) సుబ్బయ్య గత 15 సంవత్సరాల నుండి రసాయనిక ఎరువులు, పురుగు మందుల జోలికే పోకుండా మెట్ట వ్యవసాయం చేస్తున్నాడు. తన తమ్ముడు నాగయ్యతో కలిసి ఉమ్మడి కుటుంబంగా వ్యవసాయమే ఆధారంగా బతుకుతూ ఉన్నాడు. రసాయనిక ఎరువులు, పురుగుమందులు వాడకపోవడానికి కారణమేమిటి అన్న ప్రశ్నకు రైతు సుబ్బయ్య చెప్పిన తన జీవితానుభవాలే అతని సేంద్రీయ వ్యవసాయ రైతుగా మార్చినాయని అనిపించింది. సేంద్రీయ వ్యవసాయం ప్రకృతిపరమైనది. తన, తన కుటుంబ సభ్యుల క్షేమం, ఇతరుల క్షేమాన్ని కాంక్షిస్తూ తనను ఆదరించే భూమిపట్ల ప్రేమాభిమానాలు ఉన్నవాడు తప్పనిసరిగా సేంద్రీయ వ్యవసాయదారుడుగానే మారతాడని అనిపించింది.

సుబ్బయ్య తండ్రి ఎర్రన్నకు ఇద్దరు కుమారులలో సుబ్బయ్య పెద్దవాడు. అనంతపురంలో డిగ్రీ చదువుతూ కుటుంబ పరిస్థితుల కారణంగా చదువు మానివేసి వ్యవసాయంలోకి దిగినాడు. చదువుకునే దశలో కలిగిన తాత్విక జ్ఞానం, సంస్కార భావాల ప్రభావంతో తన పెళ్ళి విషయం నుంచి, కుటుంబ సామాజిక జీవనం వరకూ సాంఘిక దురాచారాలను దరిచేరనీయకుండా సంస్కారవంతంగా జీవనం గడుపుతున్నాడు. ఆ తాత్విక జ్ఞానంతోనే అందరినీ రక్షించే నేల తల్లికి రసాయనిక ఎరువులు, పురుగు మందులు వేసి నాశనం చేయరాదని అభిప్రాయపడ్డాడు. దాదాపు 15 సం॥ క్రితం ప్రభుత్వ అధికారులు ఒక సమావేశంలో రసాయనిక ఎరువులు వాడడంవలన భూమి ఏ రకంగా నష్టపోతున్నది వివరించారు. సేంద్రీయ ఎరువులు వాడడమే భూమికి ఆరోగ్యకరం అని వివరించగా విన్నాడు. వినిన మిగతా రైతులు సమావేశం తర్వాత గుర్తు పెట్టుకోకుండా పోయివుండవచ్చు. కానీ సుబ్బయ్య మాత్రం అప్పటి నుండి రసాయనిక ఎరువులు, పురుగు మందుల జోలికే వెళ్ళకూడదని గట్టి నిర్ణయం తీసుకున్నాడు. అప్పటి నుండి తనకున్న మొత్తం 15 ఎకరాల మెట్ట పొలంలో ఏనాడూ రసాయనిక ఎరువులు కానీ, రసాయనిక పురుగు మందుల కానీ వాడకుండానే తన కుటుంబానికి లోటు లేకుండా జీవనం గడుపుతూ ఉన్నాడు. అప్పటి నుండి పెద్ద పెద్ద పెట్టుబడులతో పంటలు వేసి తొందరగా గొప్ప ఆదాయాలు పొందాలని ప్రయత్నాలు చేయలేదు. పంట నష్టాలతో పంట పెట్టుబడులు పోగొట్టుకున్న సందర్భాలు కూడా లేవు. రసాయనిక వ్యవసాయంలో అధిక పెట్టుబడులతో చుక్కలూ, పంట నష్టాలతో పాతాళం రెండూ కనపడతాయని సుబ్బయ్య వాఖ్యానం. సేంద్రీయ వ్యవసాయ విధానంలోనే అతి తక్కువ పెట్టుబడితో నష్టం లేకుండా ఆదాయం స్థిరంగానే వుంటుందని చెబుతున్నాడు.

### కరువులు, నీటి ఎద్దడి తట్టుకోవడానికి పండ్ల తోటలే పరిష్కారం

జిల్లాలో నమ్మకంలేని వర్షాలు, అడుగంటిపోతున్న భూగర్భజలాల పరిస్థితులలో సీజను పంటలకంటే సాధ్యమయినంతవరకూ పళ్ళ చెట్లు పెంచుకోవడమే పరిష్కారమని భావించాడు సుబ్బయ్య. దాదాపు 3 ఎకరాలలో నాలుగు సంవత్సరాల క్రితం 400 చీనా చెట్లు నాటినాడు. చెట్లు నాటేముందుగా చెట్ల గుంతలలో పశువుల ఎరువు వేయాలనుకున్నాడు. కానీ ఎరువులు లేక వేయలేదు. వట్టి గుంతలలోనే చెట్లునాటినాడు. అయితే రసాయనిక ఎరువులు వాడకుండా వుండడం మూలంగా భూమి సాధారణ స్థాయికి వచ్చింది. ఇపుడు చెట్లు చాలా ఆరోగ్యకరంగా, సహజ రంగుతో ఉన్నాయి. తనతోపాటుగానే చీనా చెట్లు నాటిన మరో రైతు చెట్లకు రసాయనిక ఎరువులు వాడుతున్నా, చాలా చెట్లు మొక్క దశలోనే చనిపోయినాయని, తన చెట్లంత ఆరోగ్యంగా లేవని చెబుతున్నాడు. సుబ్బయ్య ఒక బోరు వేసుకుని చాలా పరిమితంగా నీటిని వినియోగిస్తున్నాడు. చెట్ల మధ్యలో కంది, టమోటా లాంటి అంతర పంటలు పండించినా సేంద్రీయ పద్ధతుల్లోనే.

### వేరుశెనగ జోలికే వెళ్ళని సుబ్బయ్య

పెట్టుబడులే అవసరం లేని పంటలనే పండిస్తున్నాడు సుబ్బయ్య. వేరుశెనగ విత్తనానికి పెట్టుబడి అవసరం అవుతుందని భావించి దాని జోలికే వెళ్ళడం లేదు. పెట్టుబడులు 3-4 వందలు దాటని పంటలనే ఎంచుకుంటున్నాడు. కంది, కొర్ర, సద్ద, టమోటా, వంకాయ, చోడేకాయలాంటి చిన్న చిన్న పంటలనే పండిస్తున్నాడు. రసాయనిక ఎరువులు వాడకపోవడంవలన పంటలకు తెగుళ్ళు కూడా రావడం లేదు. ఎప్పుడైనా పురుగు కనిపిస్తే, వెంటనే వేపనూనె పిచికారి చేస్తానంటున్నాడు. ఒకసారి టమోటా పంటకు పొగాకు లద్దెపురుగు ఎక్కువగా కనపడితే, పురుగులన్నీ చేతులతోనే ఏరివేసిన అనుభవం వుంది. ఇంతవరకూ ఏ పంటకూ కూడా తెగుళ్ళు ఇబ్బంది పెట్టిన సందర్భం లేదని సుబ్బయ్య అనుభవపూర్వకంగా చెబుతున్నాడు. ప్రస్తుతం సుబ్బయ్య పొలాన్ని పరిశీలించినపుడు పొలంలో చౌడేకాయల పంట వుంది. (గోరు చిక్కుడు) రేటు బాగా ఉందని అర్ధ ఎకరా పంటలోనే ప్రతి నాలుగు రోజులకు వెయ్యి రూపాయల పంట ఆదాయం వస్తూవున్నదని, ఇంతవరకూ దాదాపు 40 వేల ఆదాయం వచ్చిందని తెలిపాడు. చౌడేకాయలు కూడా మంచి నాణ్యతగా నవనవలాడుతూ వున్నాయి.

### క్రొత్త క్రొత్త ఆలోచనలతో...

400 చీనా చెట్లకు తోడుగా నీటి ఎద్దడికి తట్టుకుని ఏ మాత్రం ఖర్చు లేకుండా ఆదాయమిచ్చే వనరు ఏమిటా అని ఆలోచించి 2½ ఎకరాలలో 140 నల్ల నేరేడు చెట్లు నాటుకున్నాడు. ఇప్పుడూ వాటికి 16 నెలల వయస్సు. నాటిన మొక్కలన్నీ బతికి వున్నాయి. మొక్కలు చాలా ఆరోగ్యకరంగా వున్నాయి. వాటికి ఎరువు వేయలేదంటే నమ్మబుద్ధి కాదు కానీ, పశువుల ఎరువు కొనలేక అసలు ఎరువులే వేయలేదంటున్నాడు సుబ్బయ్య. చెట్ల మధ్యలో వేసిన పంటలు అయిపోయిన తర్వాత భూమిలోకి కలిపి దున్నడం, గడ్డి, గాదం చెట్ల పాదుల్లో వేసి భూమిలో కలిపి వేయడంతోనే పొలంలో వర్షాకాలంలో వానపాములు భూమిలో అభివృద్ధి చెందుతున్నాయని చెబుతున్నాడు సుబ్బయ్య.

(మిగతా 3వ పేజీలో)

**ప్రచురణ:** డైరెక్టరు - ఎ.ఎఫ్. ఎకాలజీ సెంటర్, ఉప్పరపల్లి రోడ్డు, బెంగుళూరు హైవే, అనంతపురం - 515 002.
☎ (08554) - 244222 / 246884, ఫ్యాక్స్ : (08554) - 244990, E-mail : actionf@sancharnet.in / actionf_atp@dataone.in